శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు




**నెల్లూరు(విద్య), డిసెంబర్ 10, ప్రభాతవార్త** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం నెల్లూరులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీ నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా జడ్జి వాణి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అవినీతి నిర్మూలించాలంటే యువత నడుంబిగించాలని పిలుపునిచ్చారు. యావత్ దేశానికి బంగారు భవిష్యత్తు నిర్ధేశించేది ప్రజలే అని తెలిపారు. ప్రపంచ మానవ హక్కుల సంఘం దేశ వ్యాప్తంగా ప్రజలకు హక్కులపై అవగాహన కల్పిస్తూ సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తదుపరి యాన్టీ ర్యాగింగ్ యాక్ట్ గురించి, బాల్య వివాహాలు హిందూ మ్యారేజ్ ఆక్ట్ గురించి వివరించారు. అనంతరం ప్రపంచ మానవ హక్కుల సంఘం చైర్మన్ ఎం.సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిరక్షరాస్యులకు అర్థమయ్యేలా ప్రపంచ మానవ హక్కుల సంఘం వారి హక్కుల కోసం పోరాటం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ హక్కుల సంరక్షణకు నిర్ణయంగా నిలబడి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. వీటిని ఎదుర్కొని దేశ ప్రజలందరికి మానవ హక్కులు అందేలా చూసేందుకే ప్రపంచ మానవ హక్కుల సంఘం ఏర్పడిందన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా ఉండానికి రక్షణ వలయంగా ప్రపంచ మానవ హక్కుల సంఘం నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ కే.క్రిషయ్య, సీఈఓ రాజా యాదవ్ బోధన సిబ్బంది విద్యార్థులకు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికలలో కావలిలో తెలుగుదేశం పార్టీ అడ్రస్ గల్లంతు



**కావలి,డిసెంబరు 10 ప్రభాతవార్త** రానున్న ఎన్నికలలో కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మళ్లీ గల్లంతవుతుందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఈ నియోజకవర్గంలో టిడిపి తరపున ఎవరు పోటీ చేస్తారో తెలియని పరిస్థితుల్లో ఆ పార్టీ కొట్టుమిట్టాడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. కావలి మున్సిపాల్టీ పరిధిలోని 7వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి అభివృద్ధి పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇటీవల సంభవించిన తుఫాన్‌కు పేద ప్రజల్ని పలుకరించి ఆదుకోవడంలో ప్రతిపక్ష పార్టీలు ఘోరంగా వైఫల్యం చెందాయన్నారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన, కమ్యూనిస్టు పార్టీ నేతలు అడ్రస్ లేరన్నారు. ఎన్నికలు వస్తున్నాయని ఈ పార్టీల నేతలు పగటి వేషగాళ్లలాగా వస్తూ మాయమాటలు చెబుతారని మోసానికి గురికావద్దని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. తుఫాన్ బాధితులను ఆదుకోకుండా విమర్శలు చేయడం పనిగా పెట్టుకున్నారన్నారు. తాను ఈసారి ఎంపిగా పోటీ చేస్తున్నట్లు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వాటిని నమ్మవద్దన్నారు. కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా మళ్లీ తానే పోటీ చేస్తున్నానని, ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పోటీ చేయడం జరుగుతుందన్నారు. స్వయాన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తనను పోటీ చేయమని ఆదేశించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికలలో మా ఇద్దరిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రముఖ రియల్టర్ జనిగర్ల మహేంద్ర యాదవ్, పొనుగోటి అనూరాధ, తోట శ్రీహరి, మండలి కృష్ణారావు, నాగాచారి, నాయబ్ రసూల్, తిరివీధి ప్రసాద్, మున్సిపల్ డిఇ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ తైక్వాండో పోటీల్లో ఆదాని వరల్డ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**ముత్తుకూరు, డిసెంబర్10, ప్రభాతవార్త** జాతీయ తైక్వాండో పోటీలతో ఆదాని వరల్డ్ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపి పథకాలను కైవశం చేసుకున్నారు. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో 8రాష్ట్రాల నుంచి 300పాఠశాలల నుండి 1800మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఆదాని వరల్డ్ స్కూల్ విద్యార్థులు పాల్గొని గోల్డ్,సిల్వర్,కాంస్య పతకాలను కైవసం చేసుకోవడం పట్ల ప్రిన్సిపల్ సిరియాల సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆదాని కృష్ణపట్నం సిఈవో జిజెరావు కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జి.వేణుగోపాల్ ఇతర ఉన్నతాధికారులు విజేతలను అభినందించారు. ఆదాని వరల్డ్ స్కూల్ నుంచి పాల్గొన్న ఐదుమంది విద్యార్థులు పథకాలు సాధించడం విశేషం. లాస్యప్రియ అండ్(14) 44కేజీల విభాగం గోల్డ్ మెడల్‌సాధించగా, ఆసువినేష్ అండర్(14)61కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి విజేతలుగా నిలవడం జరిగింది. అలాగే సోమిని రజత పతకం, గురుత్తమ్ రజత పతకం, ప్రణయ్ కాంస్య పతకాలు సాధించడం జరిగింది.

## ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్మోహన్‌రెడ్డే గద్దెనెక్కుతారు !



**కావలి,డిసెంబరు 10 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డే గెలుపొందాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. జగనన్న మళ్లీ సియం కావాలని 'జయహో జగన్' పేరుతో పాదయాత్ర చేపట్టిన విజయనగరం జిల్లా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. మార్గమధ్యంలోని కావలిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి ఆదివారం విచ్చేశారు. రఘురాజును ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి స్వాగతం పలికి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడారు. జగనన్న ముఖ్యమంత్రి కావాలని తిరుమలకు పాదయాత్ర చేపట్టానన్నారు. 43 రోజుల పాటు జరిగే ఈ పాదయాత్రలో 820 కిలోమీటర్లు నడవాల్సి వుందన్నారు. పది రోజుల్లో తిరుమలకు చేరుకుంటానన్నారు. జగన్మోహన్‌రెడ్డి జన్మదినం నాడు తిరుమల దర్శనం చేసుకుంటానన్నారు. ఈ పాదయాత్రకు సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. తనపై వున్న ఎంతో అభిమానంతో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలకడం ఎంతో అదృష్టంగా వుందన్నారు. తిరుమల వెంకన్నను దర్శించుకుని రానున్న ఎన్నికలలో జగనన్నను సియం చేయాలని వేడుకుంటానన్నారు. కరోనా కష్టకాలంలో కూడా సియం చేసిన అభివృద్ధిని ప్రజలు ప్రశంసించారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళ మృతిపై అనుమానస్పద కేసు నమోదు

**కలువాయి డిసెంబర్ 10 ప్రభాతవార్త** మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన రేఖా అనే వివాహిత మృతి పట్ల ఆమె తల్లి వజ్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు కలువాయి పోలీసులు తెలిపారు. రేఖ అనారోగ్యంతో నెల్లూరులోని హాస్పటల్ నందు మృతి చెందింది. ఈక్రమంలో మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. తన కుమార్తె మృతికి వారి కుటుంబసభ్యులు కారకులని ఆమె ఇచ్చిన ఫిర్యాదులో పేర్కుంది.

## ఆటో ఢీ.. ఒకరికి గాయాలు

**తోటపల్లిగూడూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త** మద్యం మత్తులో ఆటో నడిపిన ఘటనలో జరిగిన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డ ఘటన ఆదివారం రాత్రి సంభవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. తోటపల్లిగూడూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మనోహర్ ఇసుకపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో రోడ్డు మార్జిన్‌లో టిఫిన్ దుకాణానికి చెందిన మన్నెం భాస్కర్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో టిఫిన్ షాపు నిర్వాహకులు భాస్కర్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం 108 వాహనంలో హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ మనోహర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు కాగా ఆటో డ్రైవర్ మద్యం మత్తులో దుకాణంలోకి దూసుకుపోయినట్లు తెలిసింది.

# రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది...కాకాణి



**మనుబోలు,డిసెంబర్ 10,ప్రభాతవార్త :** మిచౌంగ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న రైతులకు మా ప్రభుత్వం అండగా ఉంటుందనీ రాష్ట్ర వ్యవసాయా, మార్కెటింగ్,ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి వర్యులు కాకాని గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని లోతట్టు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం మిచౌంగ్ తుఫాన్ లో దెబ్బతిన్న నారుమడులను ఆయన పరిశీలించారు. ముందుగా వెంకన్నపాళెం గ్రామంలో సచివాలయం బిల్డింగ్ పైకి ఎక్కారు. అక్కడి నుండి వరద ముంపుకు గురైన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం సచివాయం వద్ద రైతులకు 80 శాతం రాయితీతో విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాకాని గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి,బాపట్ల జిల్లాల్లో పర్యటించారని,కేంద్ర ప్రభుత్వంతో సం బందం లేకుండా నష్ట పరిహారాన్ని అందజేస్తామన్నారు.ఇదే సమయంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సైదాపురం వెళ్ళి ఆందోళన చేసి ముడుపులు తీసుకున్నారనీ ఆరోపించారు.సోమిరెడ్డి లాంటి నాయకుడును పట్టించుకోవల్సిన అవసరం లేదని ,ఆయన కాలం చెల్లిన మందు లాంటి వారనీ విమర్శించారు.ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి నేతలు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి,దాసరి భాస్కర్ గౌడ్,ముంగర రవీందర్‌రెడ్డి,నారపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి సర్పంచ్ తలారి పెంచలమ్మ,అడపాల శివకుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు శశిరెడ్డి,భారతమ్మ,జానకిరామిరెడ్డి ,గుండాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి భాగస్వామ్యంతో సాగునీటి సమస్య పరిష్కారం : ఎమ్మెల్యే



**ఆత్మకూరు ,డిసెంబర్10,ప్రభాతవార్త :** గత రెండు సంవత్సరాల క్రితం కురిసిన వర్షాలతో కనుపూరు పల్లి వద్దనున్న లిఫ్ట్ ఇరిగేషన్ కొంత దెబ్బతినిందని రైతులు , వైసిపి నాయకులు ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో రైతుల భాగస్వామ్యానికి తోడు ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం , జిల్లా కలెక్టర్ ద్వారా మంజూరు చేసిన నిధులతో లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ పనులు నిర్వహించామన్నారు. దీంతో రైతుల సాగునీటి సమస్యలు పరిష్కారం కానున్నట్లు ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కనుపూరుపల్లి సమీపంలో ఉన్న లిఫ్ట ఇరిగేషన్ పనులను రైతులు, ప్రజా ప్రతి నిధులు, అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో కలసి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలల క్రితం రైతులు, ప్రజా ప్రతినిధులు , వైసిపి నాయకులు కనుపూరుపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ పనుల విషయమై తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. సుమారు 1400ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించే ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పునరుద్ధరణ చేపట్టేందుకు సమిష్టి భాగస్వామ్యంతో ముందుకు వచ్చారన్నారు. మొత్తం 15లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని అందులో 5లక్షలు రైతుల భాగస్వామ్యంతోపాటు ఎడిఎఫ్ ద్వారా 5లక్షలు అందజేశారన్నారు. మరో 5లక్షలు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మంజూరు చేయించామన్నారు. ఈసంవత్సరం వర్షాలు తక్కువగా కురిశాయని , గతంలో జరిగిన ఐఎబి సమావేశంలో డెల్టాకు మాత్రమే నీటిని విడుదల చేస్తారని నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆత్మకూరు నియోజకవర్గ రైతాంగ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళామన్నారు. దీంతో అన్నమయ్య ప్రాజెక్ట్, సోమశిల జలాశయం మిగులు జలాల ద్వారా సోమశిల ఉత్తర, దక్షిణ కాలువల ద్వారా నియోజకవర్గంలోని ఏఎస్‌పేట మండలం వరకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ రైతాంగ సమస్యను తెలిపిన వెంటనే స్పందించి నీటి విడుదలకు అనుమతులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమశిల జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్న సమయంలో భారీ వర్షాలు కురిసి నియోజకవర్గానికి మేలు చేశాయన్నారు. సోమశిల జలాశయంలో 34టిఎంసిల నీటి నిల్వ ఉందని ఆ నీటిని కావలి, కనుపూరు కెనాల్స్, డెల్టాలకు అందించాల్సి ఉందని ఇందుకోసం అందరూ సమన్వయంతో అవసరమైన మేరకే సాగునీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో రైతాంగం కోసం వచ్చే నెలలో ఎడిఎఫ్ ద్వారా వ్యవసాయ సమీక్ష నిర్వహించి రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి మర్రిపాడు రైతాంగం కోసం హైలెవల్ కెనాల్ పనులు పూర్తిచేసేలా మానిఫెస్టోలో పెట్టి నిర్ణీత సమయంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# టీడీపీ నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్



**నెల్లూరు డిసెంబర్ 10, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ చేసిన, చేయనున్న లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని మాజీమంత్రి పొంగూరు నారాయణ చేపడుతున్న సేవలు బాగున్నాయని టీడీపీ మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని నారాయణ క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు టీడీపీ నేతలతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ బాబు ష్యూరి టీ-భవిష్యత్తు గ్యారెంటీ బిఎల్ఏ, బూత్ కన్వీనర్, క్లస్టర్ ఇన్‌చార్జ్, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో కలిసి నారాయణ ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించడంలో నారాయణ తీరు ఎంతో చక్కగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని చంద్రబాబు నాయకులకు దిశ నిర్ధేశం చేశాడు. ప్రత్యేకంగా ఆ టెలికాన్ఫరెన్స్‌లో రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు దర్మవరం సుబ్బారావు చేపడుతున్న కార్యక్రమాలను, ఆయనని, చంద్రబాబు ప్రశంసించాడు. చంద్రబాబునాయుడు అభినం టీడీపీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్, నారాయణ కాలేజ్ జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ళ విజేతరెడ్డిలు రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో నగర నియోజకవర్గం భారీమెజార్టీతో గెలిచేలా పనిచేస్తున్నామని వారు చంద్రబాబుకి వారు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర కార్యదర్శి దొడ్డపనేని రాజానాయుడు, జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ, తాళ్ళపాక అనూరాధ, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కాకర్ల తిరుమలనాయుడు, మహేంద్రరెడ్డి అలియాస్ చిన్నబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాయి క్షేత్రంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం



**కావలి, డిసెంబరు 10 ప్రభాతవార్త** కావలి బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో ముసునూరులోని సాయిక్షేత్రంలో ఆదివారం కార్తీక వనసమారాధన వేడుకలను నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంను నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కళ్యాణం వైభవంగా జరిగింది. నెల్లూరుకు చెందిన గుండాపంతుల రామసుబ్రమణ్య శర్మ కళ్యాణాన్ని నిర్వహించారు. 700 మంది బ్రాహ్మణ సభ్యులు వనభోజనాల్ని చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిధిగా నందనవనం శ్రీనివాసరావు, ముఖ్యఅతిథులుగా శేషగిరిరావు, దైతా రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్ అథ్లెటిక్స్‌లో మూడు పతకాలు సాధించిన పద్మావతి



కావలి, డిసెంబరు 10 ప్రభాతవార్త తిరుపతిలో నిర్వహిస్తున్న 42వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో కావలికి చెందిన వెటరన్ క్రీడాకారిణి మూడు పతకాలు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ నెల 8వ తేది నుండి 10వ తేది వరకు ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో రెండు బంగారు, ఒక వెండి పతకాన్ని పద్మావతి కైవసం చేసుకున్నారు. 50 సంవత్సరాల విభాగం పోటీలలో పాల్గొన్న డాకారపు పద్మావతి హామర్‌త్రో, డిస్కస్‌త్రోలో బంగారు పతకాలు, ట్రిబుల్ జంప్‌లో వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడారు. తనకు శిక్షణ ఇచ్చిన విశ్రాంత వ్యాయామ అధ్యాపకురాలు కోటేశ్వరమ్మ, ప్రోత్సహించిన రెడ్‌క్రాస్ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా నీలకంఠేశ్వరస్వామి వారికి భస్మాభిషేకం

**కలువాయి డిసెంబర్ 10 ప్రభాతవార్త** నమస్తే అస్తు భగవాన్....విశ్వేశ్వరాయ....మహాదేవాయ.... త్రయంబకాయ....త్రిపురాంతకాయ.... త్రికాగ్నికా లాయ.... కాలాగ్ని రుద్రాయ, నీలకంఠాయ, మృత్యుంజయయా.... సర్వేశ్వరాయ..... సదాశివాయ.... శ్రీమన్ మహాదేవాయ నమః అంటు వేద పండితులు శ్రీరాజరాజేశ్వరీ సమేత నీలకంఠేశ్వంస్వామి వారికి భస్మాభిషేకంను వైభవంగా నిర్వహించారు. కలువాయిలో వెలసియున్న శ్రీరాజరాజేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం నందు ఆదివారం 108 మంది దంపతులతో సామూహిక పూజా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు కె.వి నంసింహారావు ఆశీస్సులతో కలువాయి శివభక్త మండలి ఆధ్వర్యంలో కన్నుల పండుగగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగాస్వామి వారికి పంచామృతాభిషేకం, భస్మాభిషేకం, అదే విధంగా శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారికి సహస్ర నామకుంకుమార్చనతోపాటు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి పూజా కార్యక్రమం నిర్వహించే సమయంలో కార్తీమాస విశిష్టతను వైభవాన్ని భక్తులకు తెలియజేస్తు అర్చకులు కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని దేవస్థానం నందు సామూహిక పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం అదే విధంగా ప్రతి శివరాత్రి నాడు వైభవంగా వేలాది మందికి స్వామి వారి సన్నిధానంలో అన్న ప్రసాద వితరణతోపాటు గ్రామోత్సవం , ఈ మహోత్తర కార్యక్రమాలకు భక్తుల సహకారం అందించడం జరుగుతుందని శివభక్త మండలి సభ్యులు పేర్కున్నారు. అనంతరం పెద్దఎత్తున అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈకార్యక్రమానికి



పుట్టమన్ను ద్వారా 108 శివలింగాలను స్వయంగా తయారు చేసిన ఉపాధ్యాయులు మోదు వెంకటరమణ, నాగేశ్వరీ దంపతులను ,అదే విధంగా ఉపాధ్యాయులు శివభక్త మండలి సభ్యులు బొట్ల కోటేశ్వరరావును ఆలయ అర్చకులు స్వామి వారి ఆశీర్వచనాలు అందించగా కలువాయి జడ్‌పిటిసి బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి, శివభక్త మండలి బృందం శాలువా పూలమాలలతో వారిని సత్కరించారు. ఈకార్యక్రమంలో గ్రామ పోరోహితులు యినపకుతిక రాజగోపాల్‌శర్మతోపాటు పలువురు స్వామి వారిని దర్శించుకున్నారు.

## గిరిజనులకు తుఫాన్ సహాయం



**బిట్రగుంట, డిసెంబరు 10 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలోని రామస్వామిపాళెం గిరిజన కాలనీకి చెందిన కుటుంబాలకు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ముంపుకు గురైన బాధితులకు 25 కిలోల బియ్యం,కిలో కందిపప్పు, కిలో నూనె,కిలో ఉల్లగడ్డలు పంపిణీ చేసినట్లు గ్రామ సర్పంచ్ గందూరు మంజుల తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రామస్వామిపాళెం గిరిజన కాలనీ ముంపుకు గురవడంతో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్పందించి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని తీసుకొచ్చి సాయం ప్రకటించడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్వో మల్లికార్జునరావు, వైసిపి నేత గందూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారపార్టీ వైఫల్యాలు బయటపడతాం : టిడిపి



**బుచ్చి డిసెంబర్ 10 ప్రభాతవార్త** వైసిపి ప్రభుత్వం వైఫల్యాలు బయటపడతామని తెలుగుదేశం మండల పార్టీ అద్యక్షులు ఎం.వి శేషయ్య విమర్శించారు.బుచ్చిరెడ్డిపాలెంలోని టిడిపి పార్టీ కార్యలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు అధికార పార్టీ నాయకులు నగరపాలక పంచాయితీని అభివృద్ధి చేయడంలో పూర్తి స్దాయిలో విఫలమైయ్యారని ఆయన విమర్శించారు.ఇష్టాను సారంగా ఇంటిపన్నులు పంచారని విమర్శించారు. చెన్నూరురోడ్డులో సెంట్రల్ లైటింగ్ పేరుతో వ్యాపారస్తులు ఇండ్లన్ని పగలగొట్టి ఒక్కొక్కరికి లక్షరూపాయాలు నష్టం కలిగించారని ఆరోపించారు.బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫల్ భవనం పగలగొట్టి దానిని కట్టకుండా అసంపూర్తిగా నిలిపివేశారని అన్నారు. మీటింగ్‌లకు అంగన్‌వాడీ కార్యకర్తలను ,ఆశా వర్కర్లను, వాలింటరీలను పెట్టుకొని మీటింగ్‌లు పెట్టి ఉపన్యాసాలు ఇస్తున్నారు తప్ప బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీకి చేసింది ఏమి లేదని విమర్శించారు. బిటెక్ చదివిని విద్యార్దులను సైతం 5 వేలు వచ్చి వాలింటర్లపేరుతో వారి జీవితాలతో అడుకుంటున్నారని అన్నారు. వైసిపి పాలన సర్వం వైఫల్యాలు అని విమర్శించారు.నగరపాలక పంచాయితీలో అవసరమైన చోట్ల రోడ్డు వేయకుండా వ్యక్తిగత రోడ్డులకు సిమెంట్‌రోడ్డు వేసుకున్నారని విమర్శించారు.అనంతరం జూగుంట పురుషోత్తమ్ మాట్లాడుతు గతంలో టిడిపి హయాంలో తుఫాన్ వచ్చిన సమయంలో యుద్ధప్రాతిపదికన స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేశామని చెప్పారు. ప్రస్తుతం వచ్చిన తుఫాన్‌కి ప్రజలను ఆదుకోవడంలో పాలక వర్గం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నగరపాలక పంచాయితీలో రోడ్లు అద్వాన్నంగా ఉన్నా పట్టించుకోలేదు. అధికార పార్టీనాయకులు నగరపాలక పంచాయితీలో చేసింది ఏమిలేదని విమర్శించారు.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చేసిన వైఫల్యాలను ప్రతి ఇంటికి తీసుకొని వెళతామని,అధికార పార్టీకి సరైన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మండలపార్టీనాయకులు బత్తల హరికృష్ణా, జూగుంట పురుషోత్తమ్, వింజం రామానాయుడు,కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్,తిరివీధి రాధాకృష్ణయ్య,మైనార్టీనాయకులు అహ్మద్ ,షబ్బీర్,సర్దార్,కాలేషా, చిలకా బాలకుమార్, వల్లూరు శ్రీనివాసులు, పలువురు టిడిపినాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గిరిజనుడు మృతి



**బిట్రగుంట, డిసెంబరు 10 ప్రభాతవార్త** బోగో లు మండలం విశ్వనాధరావుపేట పంచాయ తీలోని రామస్వామిపాళెం గిరిజన కాలనీకి చెందిన చౌటూరి శూలమయ్య(32) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గిరిజన కాలనీకి చెందిన శూలమయ్య, పాముల మస్తాన్‌లు రామస్వామిపాళెం నుండి మోటార్‌సైకిల్‌పై ఉలవపాళ్ళకు వెళ్తుండగా పెట్రోల్ బంకు వద్ద ట్రాలి ఢీకొనడంతో శూలమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పా ముల మస్తాన్‌కు కూడా తీవ్ర గాయాలై పరిస్థితి విషమించడంతో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ సంఘటన వల్ల రామస్వామిపాళెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఆదరణ కేంద్రానికి కాండ్ర యువనేస్తం వితరణ



**బిట్రగుంట, డిసెంబరు 10 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరులోని భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆదరణ కేంద్రానికి నాగులవరం గ్రామానికి చెందిన కాండ్ర యువ నేస్తం వ్యవస్థాపక అధ్యక్షులు కాండ్ర సతీష్‌నాయుడు యువనేస్తం సభ్యుల ద్వారా 15 వేల రూపాయలు విలువ చేసే నిత్యావసర వస్తువులు వితరణగా అందజేశారని ఆదరణ కేంద్ర డైరెక్టర్ కె.సింహాద్రిరావు తెలిపారు.గత రెండున్నర సంవత్సరాల నుండి కాండ్ర సతీష్‌నాయుడు ప్రతి నెల నిత్యావసర వస్తువులు వితరణగా అందించడం పట్ల ఆదరణ కేంద్ర నిర్వాహకులు సింహాద్రిరావు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

## సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తాం



**బిట్రగుంట, డిసెంబరు 10 ప్రభాతవార్త** బోగోలు మండలంలో తుఫాన్,భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న వరినారుమడి రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై వరి విత్తనాలు అందజేసి ఆదుకుంటామని నాగులవరం ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు సుంకే మాల్యాద్రినాయుడు తెలిపారు. మండలంలోని తాళ్ళూరు గ్రామంలో ఆదివారం తుఫాన్ సందర్భంగా జీవనోపాధి కోల్పోయిన గిరిజన కుటుంబాలకు నిత్యావసర వస్తువుల్ని ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు కూడా సబ్సిడీపై వరి విత్తనాలు అందజేయడమే కాకుండా కావలి కాలువ కింద వరి సాగు చేసే రైతులకు, ఆరుతడి పంటల రైతులకు సాగునీరు అందేలా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులతో చర్చించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అమిరిశెట్టి వెంకయ్య, మండల వైసిపి ఎస్సీ సెల్ కన్వీనర్ బాలచంద్ర, వైసిపి నేత అమిరిశెట్టి శ్రీనివాసులు, విఆర్వో దొరసానిలు పాల్గొన్నారు.

## బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



**కావలి రూరల్, డిసెంబరు 10 ప్రభాతవార్త** కావలి ముసునూరు టోల్‌ప్లాజా దాటిన తర్వాత జాతీయ రహదారిపై మోటార్‌సైకిల్‌పై వెళ్తూ అదుపు తప్పి పడిపోయి గందూరి యోగేంద్ర (22) మృతి చెందాడు. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు కావలి అంబేద్కర్‌నగర్‌కు చెందిన గందూరి యోగేంద్ర ఆదివారం తన మోటార్‌సైకిల్‌పై కావలి నుండి నెల్లూరు వైపు వెళ్తూ ముసునూరు టోల్‌ప్లాజా దాటిన తర్వాత జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి పడిపోయి క్రింద డౌన్‌లో వున్న హైవే వారి పెన్సింగ్ వైరును ఢీకొని బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కావలి రూరల్ ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

## నేడే కలవళ్లలో మానమ్మకం

**వలేటివారిపాలెం డిశంబరు 10 ప్రభాతవార్త** మండలంలోని కలవళ్ల గ్రామంలో సోమవారం మానమ్మకం ను వ్వే జగనన న్న కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ అహ్మద్ రఫీక్ తెలిపారు.సచివాలయ సిబ్బందితో పాటు సంబందిత అధికారులంతా ఈ కార్యక్రమానికిహాజరుకావాలని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలి



**కావలి రూరల్, డిసెంబరు 10 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు రెండు, అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులు ఐదు ఖాళీగా వున్నాయని అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 19వ తేది సాయంత్రం లోగా దరఖాస్తులు చేసుకోవాలని కావలి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపివో సౌజన్య తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్ధులు పంచాయతీ, వార్డు సచివాలయాలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 9వ తేది నుండి 19వ తేది లోపల దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

## 10,848 ఫారం-6లు స్వీకరణ



**కోవూరు, డిసెంబరు 10 ప్రభాతవార్త** :కోవూరు నియోజకవరగ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించి డిసెంబర్ 9 నాటికి 10,848 ఓట్లు నమోదుకు స్వీకరించడం జరిగిందన్నారు. మొత్తం వీటిని ఆయా మండలాలకు సంబంధించిన బీఎల్‌వోలు పరిశీలించేలా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రస్తుతం ఇందులో 6315 ఓట్లను పూర్తిగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 2672 పరిశీనలో ఉన్నాయన్నారు. ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు, తదితరులు ఉన్నారు.

## పేద పిల్లల్ని సంరక్షించి మంచి విద్యను అందిద్దాం



**కావలి రూరల్, డిసెంబరు 10 ప్రభాతవార్త** పేద పిల్లల్ని సంరక్షించి మంచి విద్యను అందిద్దామని కావలి ఉష నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ ఉషారాణిలు తెలిపారు. కావలి వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ సంరక్షణలో వున్న 28 మంది పిల్లలకు వారు ఆదివారం నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, బియ్యం, పిల్లల భవిష్యత్ అవసరాల కోసం వారి పేర్ల మీద పోస్టాఫీసులో జమ చేస్తున్న పాస్ పుస్తకాలను అందజేశారు. అనంతరం సంస్థ సంరక్షణలో వున్న శివనాగేశ్వరికి ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు సతీష్, ఉషారాణిలు మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ ద్వారా 28 మంది పిల్లలను సంరక్షించడం అభినందనీయమన్నారు. పిల్లలందరూ ఎంతో క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఇలాంటి పేదపిల్లలు మన చుట్టు ఎంతో మంది వున్నారని తమవంతుగా కొంతమంది పిల్లలను సంరక్షించి మంచి విద్యను అందిద్దామని చెప్పారు. ఈ పిల్లలకు సహాయం చేస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. సంస్థ సభ్యులు యం.అజిత్‌బాబు, విశ్రాంత సంక్షేమాధికారి షేక్ ఖాదర్‌బాషాలు మాట్లాడుతూ సంయుక్త సేవా సంస్థ ద్వారా పేద పిల్లల సంరక్షణ, విద్య, వైద్యం విభాగాలు మొదలు పెట్టిన నాటి నుండి నేటికి 15 నెలలుగా పిల్లలను దత్తత తీసుకున్న వారు పతి నెల సహాయం అందజేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## జనవిజ్ఞాన వేదిక ద్వారా ఉపాధ్యాయులు శిక్షణ



**ఉదయగిరి,డిసెంబర్10,ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని షాదీమంజిల్‌లో విశ్వంలోని మూలకాలు అనే అంశంపై సైన్స్ ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణా తరగతులను జనవిజ్ఞానే వేధిక నిర్వహించడం జరిగింది.జెవివి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ వి.సుధాకర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.విశ్వంలోని మూలకాలు,సైన్స్ బయాలజీ,ఫిజిక్స్,కెమిస్ట్రీ అన్నింటిని మిలితం చేతి వాటి అంశాలను క్షుణ్ణంగా వివరించారు.విద్యార్ధులను శాస్త్రీయ దృక్పదం వైపు ఈ అంశాలు ఉపయోగపడతాయని పాల్గొన్న ఉపాధ్యాయులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దాదాపుగా 50మంది సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొని శిక్షణ పొందారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ రాజా వెంగల్‌రెడ్డి,జెవివి సీనియర్ నాయకులు కె.శ్రీనివాసులు,జెవివి రాష్ట్ర వర్కింగ్ సైన్స్ అధ్యక్షులు దస్తగిరి అహ్మద్ పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధి బాధితురాలుకు బెస్ట్ వాకర్స్ ఆర్థిక సహాయం



**కావలి, డిసెంబరు 10 ప్రభాతవార్త** కావలి పట్టణ పాతవూరుకు చెందిన మల్లెల సుకన్య కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న కావలి బెస్ట్ వాకర్స్ ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఆమెకు డయాలసిస్ నిమిత్తం 5 వేల 500 రూపాయలను వారి మామ వెంకటేశ్వరరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, విశ్రాంత సబ్‌ఇన్స్‌పెక్టర్ టి.వి.శేషయ్య, ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి మందా వెంకటేశ్వర్లు, సుంకు కృష్ణ, జోగి కృష్ణ, బుజ్జి,బత్తిన శ్రీనివాసులు, వెంకయ్య, క్లాత్ శ్రీను, గోపాల్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ బాధితులకు సహాయ సామాగ్రి అందజేసిన రెడ్‌క్రాస్



**కావలి, డిసెంబరు 10 ప్రభాతవార్త** కావలి పట్టణ కాలేరిగుంట గిరిజన కాలనీలో తుఫాన్‌కు నష్టపోయిన పది కుటుంబాలకు కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆదివారం తక్షణ సహాయ సామాగ్రిని అందజేశారు. రెడ్‌క్రాస్ సెర్వ్ బృందం, టీం సేవియర్స్ సభ్యులు గుడిసెల పైన టార్పాలిన్ పట్టలు కప్పారు. రిలీఫ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాకారపు రవిప్రకాష్ మాట్లాడారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా మునకకు గురై పునరావాస కేంద్రాల్లో వున్న గిరిజన కుటుంబాల వారికి రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ, జిల్లా శాఖల సహకారంతో టార్పాలిన్ పట్టలు, హైజిన్ కిట్లను అందజేయడం జరిగిందన్నారు. రాబోయే రెండు మూడు రోజుల్లో ఇతర గిరిజన కాలనీలకు కూడా సహాయ సామాగ్రి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు గంధం ప్రసన్నాంజనేయులు, హరినారపరెడ్డి, స్వర్ణలత, ప్రసాద్, టీం సేవియర్స్ సభ్యులు ప్రణీత్, కీర్తి, సౌందర్య, వినీల్, రెడ్‌క్రాస్ సామాజిక అత్యవసర స్పందన వాలంటీర్ విభాగం సభ్యులు మధుసూర్య,సాయికుమార్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతే కాకర్ల ట్రస్ట్ లక్ష్యం



**వింజమూరు,డిసెంబర్10,ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గంలో పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కాకర్ల చారిటబుల్ ట్రస్ట్‌సేవలందిస్తుందని ట్రస్ట్ సిఇఒ కాకర్ల వెంకట్ పేర్కొన్నారు. ఆదివారం వింజమూరు పంచాయతీ పరిధిలోని బొమ్మరాజుచెరువు గ్రామసమీపంలోని కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఇఅండ్ టి మెగా మెడికల్ కాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగి సిఇఒ వెంకట్ మాట్లాడుతూ కాకర్ల ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఎంతో మంది అనాదలు, అభాగ్యులకు చేయూతనందించడంతోపాటు ఈ ప్రాంత ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చి సేవలందిస్తున్నా రన్నారు. రోజూ ఏదో ఒక ప్రాంతంలో సురేష్ పర్యటిస్తూ ప్రజలతో నేరుగా మమేకమవుతూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ రెండేళ్ళ నుండి నిరంతరాయంగా ప్రజా సేవలోనే తరిస్తున్నాడన్నారు. నేడు నియోజకవర్గ పరిధిలో చెవి,ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్నవారికి నిపుణులైన వైద్యులను శిబిరానికి పిలిచి వైద్య పరిక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నారన్నారు. వినికిడి లోపం ఉన్నవారిని గుర్తించి సుమారు 5వేల రూపాయల విలువైన వినికిడియంత్రాన్ని అందజేశారన్నారు. ఈ శిబిరానికి ఇంత పెద్ద ఎత్తున వచ్చి వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవడం ఆనందకరమన్నారు. నియోజకవర్గంలో చేపడుతున్న అన్న కాంటీన్, ఆరోగ్యసంజీవిని విస్తృతంగా ప్రజల్లోకి వెళ్ళడం సంతోషకరమన్నారు. మహిళలకు ఉచిత టైలరింగ్, ఉచిత బ్యూటీషయన్ కోర్స్ , కాకర్ల పెళ్ళి కానుక, ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఈ శిబిరం లో 100కి పైగా వినికిడి యంత్రాలను అందజేశారు. శిబిరానికి వచ్చిన వారికి భోజన వసతితోపాటు రవాణా ఖర్చులను అందజేశారు. ఈ శిబిరంలో వైద్యులు డాక్టర్ రాధాకృష్ణ, ట్రస్ట్ సభ్యులు చంద్రమౌళి, డబ్బుగొట్టు బుజ్జయ్య, కొండారెడ్డి, మద్దూరి శ్రీనివాసులురెడ్డి, తోకల మాల్యాద్రి , తలపనేని మధు, గంటా అశోక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## శాలివాహన సంఘ వనభోజనాలు



**తోటపల్లిగూడూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త** మండలంలోని మండపం పంచాయతీ కాటేపల్లి శివాలయం ఆవరణలో ఆదివారం నెల్లూరు జిల్లా కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వక్తలు తమ తమ సందేశాలలో కుటుంబాల సమైక్యతకు కృషి చేయాలన్నారు. 2010 నుంచి 2023 వరకు క్రమం తప్పకుండా తమ సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ కులదేవత మల్లమాంబ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కళ్యాణ మండపం ద్వారా వచ్చే ఆదాయాన్ని శాలివాహన సంక్షేమానికి వినియోగిస్తామని వక్తలు పేర్కొన్నారు. శాలివాహన సంఘం తమ కులస్తులకు పేద వర్గాల వారికి విద్యా వసతులు కల్పించి అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాలివాహన సంఘం నేతలు కేఎస్ నరసయ్య, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బొమ్మిని శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ పెళ్లూరు శ్రీనివాసులు, శివశంకర్ సూర్య నారాయణ, మన్నేపల్లి నాగేశ్వరరావు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సుభాషిణి, పత్తిపాటి రామయ్య, లక్ష్మయ్య తోటపల్లి గూడూరు మండల స్థానిక నేత, మాజీ సర్పంచ్ పెళ్లూరు శ్రీరాములు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన శాలివాహన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## వసతులు లేని పేడూరు స్మశానం



**తోటపల్లిగూడూరు, డిసెంబర్ 10, ప్రభాతవార్త** మండలంలోని పేడూరు పంచాయతీలోని స్మశానంలో పెద్దపెద్ద చెట్లు మొలిచిపోయి ఉన్నాయి. కనీసం ఒక చేతి పంపుగాని అలాగే నీటి వసతి ఎటువంటి సదుపాయం లేకుండా ఉందని ఎంత వాన వచ్చినా ఎండ వచ్చిన బటయ చేసుకోవాల్సి వస్తుంది. అక్కడే దాన సంస్కారాలు జరుపుకునేందుకు ఎంతగానో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలియజేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నడమల రవికుమార్, కాతిరెడ్డి శ్రీనివాసులు, అన్నం నవీన్‌కుమార్, పేడూరు యూత్ అధ్యక్షులు వినోద్, ఇన్‌ఛార్జి వినయ్, యూత్ అధ్యక్షులు శరత్‌కుమార్, విష్ణువర్ధన్, సుభాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ డిఆర్ గొప్ప దార్శనికుడు, విద్యావేత్త డాక్టర్ మేఘనాధ్ చౌదరి



**కావలి, డిసెంబరు 10 ప్రభాతవార్త** విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి గొప్ప దార్శనికుడని, విద్యావేత్త అని డాక్టర్ మేఘనాథ్ చౌదరి కొనియాడారు. కావలి పట్టణంలోని డిఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో కావలి వెంగళరావునగర్‌లోని కార్యాలయంలో ఆదివారం 60 మంది నిరుపేద వృద్దులకు 60 వేల రూపాయలు విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి పాతవూరు రాజీవ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మేఘనాథ్ చౌదరి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దొడ్ల రామచంద్రారెడ్డి ఎంతో ముందుచూపుతో విద్యాలయాలను స్థాపించారన్నారు. ఎంతోమంది పేదలకు, బలహీన వర్గాల విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించి విద్యాదాతగా గణతికెక్కారన్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది ఉన్నత స్థానాలలో వున్నారన్నారు. డాక్టర్ డిఆర్ పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల ఆయన కుమారులు వినయ్‌కుమార్‌రెడ్డి, విద్యాధరకుమార్‌రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సేవా కార్యక్రమాలలో విద్యార్థులను కూడా భాగస్వాములను చేస్తూ వారిలో సేవా స్ఫూర్తిని నింపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, సేవా సమితి ఛైర్‌పర్సన్ దొడ్ల ఆదిలక్ష్మి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరి రామకృష్ణ, సతీష్‌సింగ్, జెబి కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ఆర్యవైశ్య కార్తీకమాస వనభోజనాల మహోత్సవం



### -ఆర్యవైశ్యల ఐక్యతకు నిదర్శనమే ఈ వేడుకలు
### -ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ముక్కాల ద్వారకానాద్



**నెల్లూరు,డిసెంబరు10 ప్రభాతవార్త-విద్య** పవిత్ర కార్తీక మాసాని న్ను పురస్కరించుకుని నగరంలోని స్థాని క ఎస్వీజిఎస్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం అర్బన్ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కార్తీకమాస వనభోజనాలు, సామూహిక సత్యనా రా యణస్వామి వ్రతాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, ఆర వ్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ముక్కాల ద్వారకానాద్ మాట్లా డు తు కార్తీకమాస వనభోజనాల సందర్బంగా ఆర్యవైశ్య కుటుంబ సభ్యులను అందరిని ఒకే దగ్గరకు చేర్చడటం సంతోషంగా ఉందన్నారు. అర వ్యవైశ్యుల ఐక్య తకు నిదర్శనమే ఈ వేడుకలన్నారు. కార్తీకమాస వనభోజనాలు సంస్కృతి మన తరతరాలనుండి వస్తున్న ఆచారమన్నారు. ప్రస్తుతం చిన్న చిన్న కుటుంబాలుగా ఉన్నా మనమందరం ఒకే వేదికపై ఒకే కుటుంబంలా కలవటం మిక్కిలి సంతోష్కాన్ని కల్గి ంచిందని పేర్కొన్నారు. పేద, ధనికా తేడా లేకుండా వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించాలని తలచిన కేవలం నాలుగురోజుల్లోనే అర్బన్ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో కన్నుల పండుగలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం ఇంద మందిని ఇక్కడ సంఘటితం చేయటం గర్వకారణమన్నారు. రానున్న తరాలకు మన సంస్కృతి సాంప్రదాయాలను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆర్యవైశ్యల ఐక్యతను చాటేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడు తాయన్నారు. 10వేల మందికి పైగా ఆర్యవైశ్య బం దువులను ఒకే వేదికపై చూడటం కన్నుల పం డు గలా ఉందని తమ ఐక్యత ఇలానే ఉండాలని ఆకాం క్షించారు. అలాగే అతి తక్కువ సమయంలోనే ఇంత మంది ఇక్కడకు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విచ్చేసి విజయవంతం చేసిన అందరికి పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా సామూహిక సత్యనారా యణ వ్రతం కార్యక్రమంలో 650కు పైగా జంటలు పాల్గొని పూజాది కార్యక్రమాలు నిర్వహించి స్వామి కృపకు పాత్రులైయ్యారు. అలాగే 25 మంది జంటలకు షష్టిపూర్తి మహోత్సవాన్ని ఉత్సవంలా చేపట్టారు. ఈ సందర్బంగా నిర్వహించిన సాం స్కృతిక కార్యక్రమాలు, వనబోజనాల కోసం ఏర్పా టుచేసి ఏంతో వైభవోపేతంగా, కళాత్మకంతగా రూపొందించిన భారీ సెట్టింగులు చూపరులను విశేషంగా ఆకుట్టకున్నాయి. అనంతరం వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించగా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు పేర్ల సీతారామారావు, మాజీ అధ్యక్షులు కోట సూర్యనారాయణ, సభ్యులు బైసాని జ్యోతిప్రసాద్, శ్రీరాం సురేష్, రూరల్ ఆర్య వైశ్యసంఘం అధ్యక్షులు కనమర్లపూడి సురేష్,మ పి ళా విభాగం సభ్యులు సుప్రియ,పద్మప్రియ,చిన్నపద్మ , యువజన విభాగం నాయకలు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో ఘనంగా మానవ హక్కుల దినోత్సవం



**కావలి రూరల్, డిసెంబరు 10 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.జానకిరాం, మానవ హక్కులు, వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షులు పైడి కాంతారావులు మాట్లాడారు. నేటి సమాజంలో మానవ హక్కుల ఆవశ్యకత, మానవ హక్కుల ఆవిర్భావం, హక్కుల బాధ్యతలు ఒక నాణెనికి బొమ్మ, బొరుసు వంటివన్నారు. మానవ హక్కుల ఆవశ్యకతను ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబరు 10వ తేదిన గుర్తించడం జరిగిందన్నారు. ఆ రోజు నుంచి మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. మానవ హక్కులు అనేవి వ్యక్తుల, పౌర, రాజకీయ, ఆర్థిక, సాంఘిక,సాంస్కృతిక పరమైనవని తెలిపారు. పౌరహక్కుల్లో జీవించే హక్కు అనేది అత్యంత ముఖ్యమైనదన్నారు. ఆధునిక యుగంలో పాలకులు, ప్రభుత్వాలు ప్రజల మానవ హక్కులను హరించడం పరిపాటిగా మారిందన్నారు. భారతదేశంలో మానవ హక్కుల చట్టాన్ని 1993లో ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం మన భారతదేశ మానవ హక్కుల సంఘం చైర్మన్‌గా అరుణ్‌కుమార్ మిశ్ర వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు బైనబోయిన మోహన్‌రావు, అర్థశాస్త్ర అధ్యాపకులు మాధవరావు, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు ఎస్.కె.రఫి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ కార్తీక వనభోజన మహోత్సవం



**కావలి రూరల్, డిసెంబరు 10 ప్రభాతవార్త** కావలి పట్టణ, మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం, యువజన కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డులోని ఏటూరి రామిరెడ్డి వారి తోట(శివాలయం ప్రాంగణ)లో కార్తీక వనభోజన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు, తదితర పోటీలు నిర్వహించి బహుములు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు పుత్తూరు సూధాచారి, ప్రధాన కార్యదర్శి తళ్ళం నరేంద్రాచారి, కోశాధికారి అన్నవరపు శ్రీనివాసాచారి, జిల్లా గౌరవాధ్యక్షులు పుత్తూరు జగయ్య ఆచారి, క్రమశిక్షణా చైర్మన్ మహంకాళి శివకుమార్ ఆచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ కలిపాకం వేణు ఆచారి, ప్రచార కార్యదర్శి పాతకమూరు జెజి శివరామప్రసాద్ ఆచారి, కార్తీక వనభోజన నిర్వాహకులు ముమ్మడిశింగు శ్రీనివాసాచారి, కోవూరు నాగార్జునాచారి, కలబందలపాటి రమేష్‌బాబు ఆచారి, గోనుగుంట భవానీప్రసాద్ ఆచారి, పప్పిచర్ల బ్రహ్మయ్యాచారి, విద్యాసాగర్ ఆచారి, బహునాదం వీరాచారి, బహునాదం మహేష్, కావలి పట్టణ, మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రజకుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసిన చంద్రబాబు



నెల్లూరు డిసెంబర్ 10, ప్రభాతవార్త-వైద్యం రాష్ట్రవ్యాప్తంగా రజకులు అభ్యున్నతికి పాటుపడిన ఏకైకపార్టీ తెలుగుదేశం పార్టీ, నారా చంద్రబాబునాయుడని టీడీపీ శాసనమండలి సభ్యుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దువ్వారపు రామారావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని టీడీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో జరిగిన రజక సాధికారిక సమావేశానికి రామారావు ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ 2014-19 ఏదాదిల్లో బీసీ, రజకులకు సంక్షేమానికి, వారి అభివృద్ధికి తిరుగులేని అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనుడు చంద్రబాబుడని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదన్నారు. రజకులకు 2014-19 మధ్యలో చేతివృతులవారికి ఇస్త్రీ పెట్టెలు, ధోబిలకి వాషింగ్ మెషీన్‌లో అందించి, వారి కుటుంబ, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్ళలో ఇప్పటివరకు, అమల్లో ఉన్న సంక్షేమ పథకాలను సైతం జగన్ రద్దుచేశాడని రామారావు ఆరోపించాడు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత రజక కార్పొరేషన్‌ను పట్టించుకున్న నాధుడేలేడన్నారు. కార్పొరేషన్ ద్వారా రుణాలు అందక ఎంతోమంది రజకుల కుటుంబ జీవనం అస్తవ్యస్తం అయిందన్నారు. బడ్జెట్‌లో రజకుల కోసం విధులచేసిన నిధులను ఈ ప్రభుత్వం పక్కదారి మళ్ళించి వారి అభివృద్ధి నిరోధకుడిగా జగన్ తయారైయ్యాడని మండిపడ్డాడు. బీసీలకి ఉన్న 35శాతం రిజర్వేషన్లను సైతం 24శాతానికి కుదించి మాకు ద్రోహం చేశాడని ఆయన ఆగ్రహాన్ని వ్యక్తంచేశాడు. వైసీపీ బీసీలకు ఎలాంటి అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టకుండా, ఉన్న సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసి వారి పూర్తిగా అణగతొక్కుతోందన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో సర్పంచులు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు 16వేలమంది ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఈ రాష్ట్రంలో బీసీలపై అనేకదాడులు జరుగుతున్నాయని, ఈ ప్రభుత్వంలో వారికి పూర్తిగా రక్షణ కరువైందని రామారావు విమర్శించాడు. అచ్చెన్నాయుడు నుంచి, కొల్లు రవీంద్ర, బిటెక్ రవి లాంటి వారందరిపై అనేక దాడులకు ఈ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బీసీలకు ఒక ప్రత్యేక రక్షణ చట్టాన్ని తెచ్చేందుకు టీడీపీ పార్టీ, చంద్రబాబు తీసుకొచ్చేందుకు సిద్దంగా ఉన్నాడన్నారు. భవిష్యత్తులో బీసీలకోసం ఒక బృహత్తర కార్యక్రమాన్ని తీసుకొస్తున్నట్లు ఆయన తెలిపారు. రజలకులకి ఒక సముచితస్థానాన్ని కల్పించింది ఒక్క టీడీపీయేనని ఆయన వక్కాణించాడు. అనుబంధ సంఘాలు, రాష్ట్రపార్టీలో, సాధికార కమిటీలో కూడా దాదాపు 5వందల పదవులను ఇచ్చి వారికి తగిన గౌరవాన్ని అందచేసిన ఘనత చంద్రబాబునాయుడన్నారు. ఈ పార్లమెంటు పరిధిలో నాయకులు టీడీపీ రజకులకు ఏమి చేసిందో వాటిని జిల్లావ్యాప్తంగా రజకులకు తెలియచేస్తూ టీడీపీ గెలుపుకు దోహదపడాలని ఆయన పిలుపునిచ్చాడు. రజకుల ప్రత్యేక గుర్తింపు ఒక కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేసిందని, వారికి అత్యవసర సమయంలో ఆదుకునేందుకు రూ.42లక్షలను గతంలో విడుదల చేసిందన్నారు, రజకుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమాలను, నిధులను కూడా వెనక్కి తీసుకున్నారడి రామారావు ఆరోపించాడు. ఈ వైసీపీ చేసిన అన్యాయాలను, టీడీపీ గతంలో చేసిన సంక్షేమాలని ప్రతి గడప గడపకి తెలియచేయాలని ఆయన సూచించారు. రామకృష్ణ, దుర్గంపాటి పద్మజ, బాపనపల్లి శశి, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనబోజనం
## గంగా అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి కళ్యాణం





**బుచ్చి డిసెంబర్ 10 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలో కార్తీక మాసం పురస్కరించుకొని ఆర్యవైశ్యసంఘం వారి ఆధ్వర్యంలో కనిగిరి రిజర్వాయర్ వద్ద 18 వ సంవత్సరం కన్నుల పండుగగా గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. అర్చకులు సురేష్‌స్వామి వేదమంత్రోచ్ చరణ నడుమ కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు.మహిళలు పెద్దఎత్తున పాల్గొని కళ్యాణం తిలకించి పరవశించారు.ఈ సందర్బంగా సురేష్‌స్వామి మాట్లాడుతు కార్తీకమాసంలో పరమేశ్వరుడి కళ్యాణం వీక్షించడం ఎంతో శుభం కలుగుతుందని చెప్పారు. గత 18 సంవత్సరాల నుండి బుచ్చిరెడ్డిపాళెం ఆర్యవైశ్య సంఘం వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు.అనంతరం కార్తీ దీపంతో గంగాహారతి ఇచ్చి నిమజ్జనం చేశారు. పెద్దఎత్తున వన బోజన కార్యక్రమాన్ని నిర్వహిం చా రు.ఈకార్యక్రమ నిర్వాహకులుగా కాకరపర్తి ప్రభాకర్ దంపతులు,ఇనుగూరు శ్రీనివాసులు దంపతులు, ఇనుగూరు సుబ్బారావు ,ఇనుగూరు సునీల్ దంపతులు, వ్యవహరించారు. కార్య క్రమంలో కౌన్సిలర్ రా చూరు సత్యనారాయణ, పెద్దలు ఇనుగూరు బాలయ్య, మొగళ్లూరు వెంకటశేషయ్య, తిరివీధి రాధాకృష్ణయ్య ,యిమ్మడిశెట్టి గోవిందయ్య పాల్గోన్నారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.వాసవీ యూత్ యువకులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, డిసెంబరు 10 ప్రభాతవార్త** : పెండింగ్ కేసుల పరిష్కారానికి ఎస్సైలు ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో వాటిని పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని కోవూరు సీఐ డి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కోవూరు సర్కిల్ కార్యాలయంలో ఆదివారం సర్కిల్ పరిధిలోని కోవూరు, ఇందుకూరుపేట మండలాలకు సంబంధించిన ఎస్సైలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో గస్తీలు పెంచి ఎక్కడా కూడా దొంగతనాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై దృష్టి సారించి బ్రీత్ అనలైజర్‌తో కేసులు నమోదు చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సకాలంలో పరిష్కరించేలా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్బంగా స్టేషన్ వారీగా పెండింగ్ కేసులపై సమీక్షించారు. ఈ సమీక్షలో ట్రైనీ డీఎస్పీ హేమలత, ఎస్సైలు రంగనాథ్‌గౌడ్, వీరేంద్రబాబులు ఉన్నారు.

## కార్తీక మాస వనభోజనాల మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి నారాయణ



**నెల్లూరు టౌన్, డిసెంబర్ 10, ప్రభాత వార్త** కాప్స్ రాక్స్ బలిజ ఆధ్వర్యంలో అట్టహాసంగా కార్తీక మాస వనభోజనాలు ఏర్పాటు చేశారు. శివునికి అభిషేకం చేసిన మాజీ మంత్రి నారాయణ, రమాదేవి దంపతులు, కాపుల అభ్యున్నతికి పాటుపడింది తెలుగుదేశం ప్రభుత్వమేనని అన్నారు. నెల్లూరు కాపు భవనం నిర్మాణానికి స్థలంతో పాటు నిధులు కూడా కేటాయించారన్నారు. 2024ఎన్నికల్లో ప్రజలందరూ ఆశీర్వదించి గెలిపిస్తే మిగిలిన అభివృద్ధి పనులన్ని పూర్తి చేస్తాం. నెల్లూరు కస్తూరిబా కళాక్షేత్రంలో నారాయణ దంపతులను ఘనంగా ఆశీర్వదించిన వేదపండితులు నెల్లూరు కస్తూరిబా కళా క్షేత్రంలో కాప్స్‌రాక్స్ బలిజ ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాలు అట్టహాసంగా ఏర్పాటు చేశారు. కాప్స్‌రాక్స్ బలిజ వారి ఆహ్వానం మేరకు కార్తీక మాస వనభోజనాలు కార్యక్రమాలకు హాజరైన మాజీ మంత్రి పొంగూరు నారాయణ, రమాదేవి దంపతులకు పూర్ణకుంభం చేతపట్టి వేదమంత్రాలతో అర్చకులు ఘన స్వాగతం పలికి ఆశీర్వదించారు. అనంతరం నిర్వహించిన వ్రతం కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కస్తూరిబా కళా క్షేత్ర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శివలింగానికి వారు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు చేశారు. తదనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి కళాకారులను, చిన్నారులను వారు అభినందించారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్తీకమాస వనభోజనాల కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి పొంగూరు నారాయణ, రమాదేవి దంపతులను గజమాలతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. తదనంతరం అందరితో కలిసి వారు భోజనాలు చేశారు. ఈ సంధ్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ కాప్స్‌రాక్స్ బలిజ ఆధ్వర్యంలో కార్తీక మాస వన భోజనాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కాప్స్‌రాక్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవ కార్యక్రమాలను ఆయన అభినందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని ఉపయోగించి సేవ చేస్తున్న కాప్స్ రాక్స్ ఫౌండేషన్ మరింత ఉన్నత స్థితికి చేరాలన్నారు. ఇందుకు తమ వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. నెల్లూరు నగర పరిధిలో 3 ఎకరాల 40 సెంట్లలో కాపు భవనానికి స్థలం కేటాయించడం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. అక్కడ కాపు భవనంతో పాటు నిరుపేదలకు వసతి భవనం కోసం డిజైన్ కూడా చేపట్టి ఫండ్స్ కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. రానున్న 2024లో ప్రజలందరి ఆశీస్సులతో తాము విజయం సాధించాక నెల్లూరులో మిగిలిన పనులన్ని పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ దఫా జరగనున్న ఎన్నికల్లో ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మామిడాల మధు, కాప్స్ రాక్స్ బలిజ నాయకులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**ఉదయగిరి,డిసెంబర్10,ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని బిట్-3 సచివాలయ పరిధిలో 11వ తేదిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి తెలియజేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాలు ప్రజలయొక్క జీవితాలను మార్చే విధంగా ఉన్నాయని,పేదప్రజల ఆర్థిక స్థితిగతులు గణనీయంగా మార్పు చెందాయన్నారు.రాబోయే రాజుల్లో వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని అందుకు మనందరం కృషి చేయాలని అప్పుడే పేదప్రజల ఆర్థిక స్థితిగతులు మరింత మెరుగుపడతాయని తెలిపారు.కుల,మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని 2024ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని తెలిపారు.ఉదయగిరి నియోజకవర్గంలోని వైయసీ పార్టీ నాయకులను కలుపుకుపోతున్న విధానం మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయానికి దోకా ఉండదని ఆయన ఈ సందర్బంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉదయగిరి మండల కన్వీనర్ సీఎం ఓబుల్‌రెడ్డి,ఉప్పుటూరి హరి,బాలిబోయిన శ్రీను,వెంకటేశ్వర్లు రెడ్డి తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణచైతన్యవిద్యాసంస్థల స్పోర్ట్స్‌మీట్




**నెల్లూరు,డిసెంబరు10 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల స్పోర్ట్స్‌మీట్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా విద్యాసంస్థల డైరెక్టర్స్ ఆర్‌వి.కృష్ణారెడ్డి, పర్వతరెడ్డి రాణా ప్రమోద్‌రెడ్డి, తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు హాజరైయ్యారు. ఎన్‌సిసిక్యాడెట్స్ వీరికి గౌరవ వందనం సమరి ్పంచారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి,శాంత కపోతాలను ఎగురవేసి ఫైనల్స్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్సీ చం ద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతు తమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటూ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం ప్రత్యేకంగా ప్రోత్సహించటం జరుగుతుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనటం వలన మానసిక,శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. క్రీడాకారులకు గెలుపోటములతో అవసరం లేదని అందరూ క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. డైరెక్టర్ ఆర్‌వి.కృష్ణారెడ్డి,పి.రాణా ప్రమోద్‌రెడ్డిలు మాట్లాడుతు గత మూడు రోజులుగా తమ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఖోఖో,కబడ్డీ,క్యారమ్స్, చెస్,క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి వాటిల్లో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందించనున్నామన్నారు. నేటి యాంత్రిక జీవితంలో క్రీడలు ఎంతో అవసరమని, అందరూ క్రీడలు, వ్యాయామం చేయటం ద్వారా శారీరక దృడతం పొందవచ్చన్నారు. అలాగే క్రీడల్లో గెలుపోటములు సాధారణమని ఓడిన వారు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రయత్ని ంచాలని సూచించారు. అనంతరం ఫైనల్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్‌లు రామాంజనేయులు రెడ్డి,శిరీష్, సుధారాణి, రాంగోపాల్‌రెడ్డి, రమేష్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాహసం షార్ట్ ఫిలింను స్విచ్ ఆన్ చేసిన మీ హీరో సుమన్



**నెల్లూరు టౌన్, డిసెంబర్ 10, ప్రభాతవార్త** జగన్ క్రియేషన్ బ్యానర్ ఆధ్వర్యంలో సాహసం షార్ట్ ఫిలింను ఆదివారం ప్రముఖ సినీ నటులు సుమన్ స్విచ్ ఆన్ చేయగా, 25 కళాకారుల సంఘాల అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమం నెల్లూరు నగరంలోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో నిర్వహించారు. సాహసం షార్ట్ ఫిలిమ్‌కు డైరక్టర్‌గా కేఎం ఆములు, కథా కో డైరక్టర్‌గా షేక్ అబ్దుల్ రషీద్, సీఐ సమరసింహగా రావూరు వెంకటేష్, హీరోయిన్‌గా షేక్ సుఫియా పర్వేజ్, రెండో హీరోయిన్‌గా కరిష్మా, కెమెరామెన్‌గా కరుణ, ఈ షార్ట్ ఫిలింకు పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సుకుమార్, ఖమర్తాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మంచి పట్టుదలతో జిల్లాకు పేరు తీసుకురావాలి



**కోవూరు, డిసెంబరు 10 ప్రభాతవార్త** : విజయనగరం జిల్లా రాజీవ్ స్టేడియంలో ఈ నెల 11,12,13 తేదీల్లో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. వీరితో పాటు జిల్లాలోని పలు పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు బాక్సింగ్ పోటీలకు ఎంపిక కాగా వీరందరూ ఆదివారం కోవూరులోని పాఠశాల క్రీడా మైదానంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారందరికీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి , స్మాష్ రాకెట్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేవిక, సిరాజ్‌లు ప్రోత్సాహకరమైన సూచనలు చేశారు. ఈ పోటీల్లో జిల్లాకు మరోసారి పేరు తేవాలని ఈ సందర్భంగా వారు విద్యార్థులకు సూచించారు.

## నందీశ్వరుడికి ప్రదోషకాల వృషభార్చన



**బుచ్చి డిసెంబర్ 10 ప్రభాతవార్త** పవిత్ర పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి సన్నిధిలో ఆదివారం నందీశ్వరుడికి ప్రదోష కాల వృషభార్చన ఘనంగా నిర్వ హించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా జిల్లా చంద్రశేఖర్,సుహాసిని దంపతులు వ్యవహారించారు. నందిశ్వరుడికి 11 ర కాల అభిషేకాలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమ ణ్యంనాయుడు, సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి విరుపారుఖుల గిరికృష్ణా పాల్గోన్నారు.భక్తులు పెద్దఎత్తున నందిశ్వరుడికి జరుగుతున్న అభిషేకాలు చూసి తరించారు.